బాలలతో పని చేయిస్తే చర్యలు

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు

సమాచారం తెలుసుకుంటున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24 : నిబంధనలకు వ్యతిరేకంగా చిన్నపిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ఫ్యాక్టరీఫామ్‌ను సీజ్ చేస్తామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామ శివారులో ఉన్న ఫ్యాక్టరీ ఫారాలను ఏఎల్‌వో, చైల్డ్ లేబర్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి ఏసీఎల్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఉన్న ఫ్యాక్టరీ యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి లేబర్‌ను తీసుకొచ్చి పని చేయిస్తున్నారని, వారికి ఎలాంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. గతంలో కూడా కొన్ని ఫ్యాక్టరీలపై కేసులు నమోదు అయినప్పటికీ నిర్లక్ష్యంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. పని ప్రదేశాల్లో చిన్న పిల్లలు అధికంగా ఉంటే అక్కడే పాఠశాల ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లేబర్‌కు కచ్చితంగా గుర్తింపు కార్డులతో పాటు రిజిస్టర్ మెయింటెన్ చేయాలని సూచించారు. పని చేస్తున్న కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనాలు కూడా చెల్లించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎల్‌వో వికార్ బాబా, బాల సంరక్షణ సిబ్బంది రేష్మ, రమేశ్, ఆర్ఐ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి విజయ్, పోలీస్ కానిస్టేబుల్ కల్యాణ్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరు కూలీలు మృతి

చిన్నకోడూర్, ఫిబ్రవరి 24 : రాజీవ్ రోడ్డులోని మల్లారం స్టేజ్ వద్ద ఈ సంఘటన జరిగింది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన విష్ణు (35), ఉల్లేష్ కుమార్ (37) మల్లారంలోని రామాంజనేయ క్రషర్‌లో పనిచేస్తున్నారు. సిద్ధిపేట నుంచి వస్తువుల కోసం తిరిగి వస్తుండగా, మల్లారం స్టేజ్ వద్ద బైక్ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం లో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

దుబ్బాక పట్టణంలో శ్రీ రాఘవేంద్ర జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు.

-దుబ్బాక,ఫిబ్రవరి24

మత్తు పదార్థాల గుర్తింపు కోసం తనిఖీలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి24 : మద్దూరు మండల కేంద్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణలో భాగంగా మద్దూరు మండల కేంద్రంలోని కిరాణా షాపులు, హోటల్స్‌తో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ మహబూబ్ మాట్లాడుతూ యువత తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవదన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా కల్గి ఉన్నా విక్రయించిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఏఎస్సై విజయ్ కుమార్, కానిస్టేబుళ్లు అజయ్ కుమార్, శ్యామ్ సుందర్ రావు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ జంటపై దాడికి యత్నం

చేర్యాల, ఫిబ్రవరి 24 : పెండ్లి చేసుకొని పోలీసులను ఆశ్రయించిన ఓ ప్రేమ జంటపై దాడికి యత్నించిన సంఘటన సోమవారం చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన ఓఅమ్మాయి, అబ్బాయి ప్రేమించుకొని హైదరాబాద్ ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కోసం చేర్యాల పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఇరువురి కుటుంబాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్లకు ప్రేమ జంట ప్రవేశిస్తున్న క్రమంలో వారిపై అమ్మాయి తరుపు బంధువులు దాడికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు.

నిబంధనలను పాటించడం లేదు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 24 : ఎన్నికల కమిషన్ రాజ్యాంగ నిబంధనలను పాటించడం లేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ కాంగ్రెస్ సర్కార్ గెలవకుండా కుట్రలను చేస్తుందని మండిపడ్డారు. బ్యాలెట్ పేపర్‌లో సీరియల్ నెంబర్‌లో ముందు వరుసలో ఉండాలని ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిగా పేరు మార్చి తనకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకులంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద ఉండాల్సిన ఓటరు వివరాలు కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి వెబ్‌సైట్లో ఎలా పొందపరిచారని ప్రశ్నించారు. సమావేశంలో న్యాయవాదులు తేజ్‌దీప్‌రెడ్డి, పిన్నరాములు, నేతలు మణిదీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- జిల్లాలో 163 బీఎన్ఎస్ఎస్ - 2023 సెక్షన్ అమలు
- పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

మాట్లాడుతున్న సీపీ డాక్టర్ అనురాధ

సిద్దిపేట, ఫిబ్రవరి 24 : ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతగా జరిపేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ 23 లొకేషన్లలో,40 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 27 లోకేషన్లలో, 27 పోలింగ్ కేంద్రాల్లో మెత్తంగా 67 పోలింగ్ కేంద్రాల్లో జరుగనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు నెంబర్ మార్క్ చేశామన్నారు. పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ జియో ట్యాగింగ్ పూర్తి చేశామని, రూట్ మొబెల్స్ -08, స్ట్రైకింగ్ ఫోర్స్- 24, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ -03, ఎఫ్ఎస్టీ , వీఎస్టీ టీమ్స్-45లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఏసీపీలు-03గురు, సీఐలు- 10,ఎస్సైలు-27, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు-67, కానిస్టేబుళ్లు- 312, మంది మొత్తం పోలీస్ అధికారులు సిబ్బంది 419 మంది, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐలు సర్కిల్ పరిధిలో ఏసీపీలు డివిజన్ పరిధిలో బందోబస్తు పర్యవేక్షణ చేస్తారని సీపీ తెలిపారు.

జిల్లాలో 163 బీఎన్ఎస్ఎస్ - 2023 సెక్షన్ అమలు

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఈ నెల 27న, జరుగనున్నందున ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు , నెల 25 సాయంత్రం 4:00 గంటల నుంచి, ఈనెల 28 తేది ఉదయం 8: 00 గంటల వరకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల వంద మీటర్ల చుట్టూ 163 బీఎన్ఎస్ఎస్ -2023 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ 163 బీఎన్ఎస్ఎస్ -2023సెక్షన్ అమలులో ఉంటుదని, ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువమంది గుంపులు గుంపులుగా తిరగవద్దన్నారు. పట్టభద్రులు, టీచర్లు పోలీసుల సలహాలు సూచనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని ఆమె సూచించారు.

కాశేగుడిసెలలో తాగు నీటికి తండ్లాట

- వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు
- 15 రోజులుగా ఇబ్బందులు పడుతున్నవైనం
- ఎమ్మెల్యే 'పల్లా'కు వినతి



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 24 : మండలంలోని కాశేగుడిసెల గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డుల ప్రజలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. 15 రోజులుగా గ్రామంలో తాగు నీరు లభించకపోవడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి బిందెల్లో, బకెట్లలో మహిళలు తాగు నీరు మోసుకొచ్చి పొద్దుగడుపుతున్నారు.వెయ్యి మంది జనాభా కలిగిన పంచాయతీలో 6 వార్డులున్నాయి. మిషన్ భగీరథ ద్వారా గ్రామానికి గతంలో నీరు పుష్కలంగా వచ్చేవి, కొన్ని రోజులుగా మిషన్‌భగీరథ నీళ్లు సక్రమంగ రాకపోవడంతో ప్రజలు సమీపంలో ఉన్న బోరు బావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాగు నీటి సమస్య రావడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. తమ గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చేర్యాలలో సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి యూత్ ఇన్‌చార్జీ శివగారి అంజయ్య ఆధ్వర్యంలో గ్రామ నాయకులు షేక్ కమాల్, దినేష్‌తివారి, శనిగరం లక్ష్మణ్, బాలరాజు వినతి పత్రం అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు మర్పడగ క్షేత్రం ముస్తాబు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 24 : మండలంలోని మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరుగనున్నాయి. వందల ఏండ్ల చరిత్రతో ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ క్షేత్రంలో ప్రతి దినం నిత్య పూజలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. మహా శివరాత్రి మహోత్సవాలకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు పరిసరాలపై అవగాహన

గజ్వేల్, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా వరి, మొక్కజొన్న పంటలు గజ్వేల్ పట్టణంలోని అర్బన్‌పార్కు, పాండవుల చెరువు, వాగుగడ్డ హనుమాన్ దేవాలయాలను చూపించారు. అనంతరం పట్టణంలోని సమీకృత కార్యాలయ సముదాయంలోని ఆర్డీవో, తహసీల్దార్, పోస్టాఫీస్, ప్రభుత్వ రంగ బ్యాంకులను చూపించి వాటి ప్రయోజనాలను విద్యార్థులకు తెలిపారు. అర్బన్ పార్కులో విద్యార్థులు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రేహాల, రాజమణి, వంట కార్మికులు నర్సమ్మ, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 24 : వివాహిత మెడలోంచి 35గ్రాముల పుస్తెలతాడు గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకపోయిన సంఘటన సోమవారం కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరుకు చెందిన సోప్పరి సుగుణ సోమవారం కూతురు, కుమారుడితో తిమ్మారెడ్డి పల్లి శివారులోని సార్ల వాడ నుంచి కొమురవెల్లి కమాన్ వైపు నడచుకుంటూ వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోంచి 35 గ్రాముల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీవశాస్త్ర పోటీ పరీక్షలో శీర్షికకు ద్వితీయ స్థానం

తొగుట, ఫిబ్రవరి 24 : రాష్ట్రస్థాయి జీవశాస్త్ర ప్రతిభ పోటీ పరీక్షల్లో తొగుట మండలంలోని ఘనపూర్ జడ్పీ పాఠశాల విద్యార్థిని శీర్షిక ద్వీతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గగన్ విహార్‌లో గురుకులాల డైరెక్టర్ రమణ కుమార్. ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి సోమవారం శీర్షికకు మెమొంటోతో పాటు నగదు బహుమతిని అందజేశారు. టీవీఎస్ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, నాగరాజ్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అలాగే మండల విద్యాధికారి నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాముని అంజలి అభినందించారు.

నాబార్డు బృందం సందర్శన

హార్వేస్టర్‌ను రైతుకు పంపిణీ చేస్తున్న చైర్మన్, నాబార్డు బృంద సభ్యులు

బెజ్జంకి, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సోమవారం నాబార్డు బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు అందుతున్న రుణాలు, సౌకర్యాలు, భవాన్ని పరిశీలించారు. సంఘం ఆధ్వర్యం లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పాలక వర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రైతు గాదె రాజుకు మంజూరైన హార్వేస్టర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు శరత్‌రావు, బృంద సభ్యులు రమేశ్ బాబు, హరిహయన్, నిది తివారి, ఆర్యన్ సక్సేన, కామేష్వర్‌రావు, జయప్రకాశ్, దిలీప్ చంద్ర, బ్యాంక్ డీజీఎం సత్యప్రసాద్, వైస్‌చైర్మన్ రమేశ్, డైరెక్టర్లు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 24: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రభాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు మండలంలోని రేబర్తి పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. సర్వశిక్ష ఉద్యోగులు చేసిన 28 రోజుల సమ్మె కాలానికి జీతాలను చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో మండల బాధ్యులు నర్సింహులు, మల్లేశం, రఫత్ ఉమర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు జననం

ముగ్గురు పిల్లలతో వైద్యులు, సిబ్బంది

గజ్వేల్, ఫిబ్రవరి 24: గజ్వేల్ ప్రభుత్వ జిల్లా దవాఖానలో సోమవారం గర్భిణి ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ముగ్గురిలో ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి కాగా, ముగ్గురు ఆరోగ్యంగా ఉన్నారు. ములుగు మండలం అడవిమజీద్ గ్రామానికి చెందిన బత్తిని నాగరత్న, నర్సింహులు దంపతులకు ఏడేండ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో దవాఖానల్లో చూపించుకున్నారు. ఏడో సంవత్సరం నాగరత్న గర్భం దాల్చడంతో ప్రతినెలా గజ్వేల్ దవాఖానలోనే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రసవం కోసం ఆదివారం దవాఖానలో చేరగా, ఆమెకు సోమవారం వైద్యపరీక్షల అనంతరం వైద్యులు డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సుశీల, డాక్టర్ అఫ్రోజ్ సిజేరియన్ చేయగా, మొదట ఇద్దరు అబ్బాయిలు తర్వాత అమ్మాయికి జన్మనిచ్చింది. మొదటి కాన్పులోనే ముగ్గురు జన్మించడంలో ఆ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సిజేరియన్ చేసి కాన్పు చేసిన వైద్య బృందాన్ని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్ఎంవో డాక్టర్ రాము అభినందించారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

దొమ్మాటలో పరామర్శిస్తున్న సోలిసేట సతీశ్ రెడ్డి

రాయపోల్,ఫిబ్రవరి 24 : కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు ఇటీవల విద్యుత్‌షాక్ గురై తీవ్రగాయలు కాగా, ఆయనను పరమర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపదలో తాము కార్యకర్తకలకు అండగా ఉంటామని, అధికారంలో లేమని కార్యకర్తలు నిరుత్సహం చెందవద్దన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజలు, రైతులు సంతోషంగా ఉండేవారని ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు మొదలైనట్లు పేర్కొన్నారు. వెంట బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సిద్దిపేటలో ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ పర్యటన

ప్రిన్సిపాల్‌తో సమావేశమైన కమాండర్ గురుప్రీత్

సిద్దిపేట, ఫిబ్రవరి 24: భారత వైమానిక దళంలో రాణించాలనే దృక్పథం ధైర్యం కలిగి దేశానికి సేవ చేయాలని ఆలోచన ఉన్న యువత విద్యార్థులు తమ విద్యను పూర్తి అనంతరం ఎయిర్ ఫోర్స్‌లో చేరాలని బేగంపేట ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ గురుప్రీత్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణంలోని ప్రజా సమావేశాల జంక్షన్‌ను మున్సిపల్ కమిషనర్ ఆశిత్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వింగ్ కమాండర్ మాట్లాడుతూ దేశానికి సేవ చేయాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరూ త్రివిధ దళాల్లో చేరవచ్చునన్నారు. ఎయిర్ ఫోర్స్‌లో చేరేందుకు యువతకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూ చించారు.

క్రీడాకారులకు టీషర్ట్‌ల పంపిణీ

వల్లంపట్లలో డాక్టర్ దయానంద్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 24 : మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన దంత వైద్యుడు డాక్టర్. బోయిని దయానంద్ సోమవారం టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గ్రామానికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీమన్నారు. మాజీ ఉపసర్పంచ్ వేల్పుల రమేశ్, క్రీడాకారులు ఎండీ రజాక్, గుండెగోని రాజుగౌడ్, భువనచంద్ర, పవన్, విజ య్, వినోద్, వినయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

మైక్‌సెట్‌ను బహూకరిస్తున్న రవీందర్‌రెడ్డి

బెజ్జంకి, ఫిబ్రవరి 24 : మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తుడు గుడా రవీందర్‌రెడ్డి సోమవారం మైక్‌సెట్‌ను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, నాయకులు ఎలుకంటి శ్రీనివాస్ రెడ్డి, ఎలుక దేవయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి 'వరకవి సిద్ధప్ప' ప్రాజెక్టు

వరకవి సిద్ధప్పపై పరిశోధన చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 24 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ విద్యార్థులు చేస్తున్న 'వరకవి సిద్ధప్ప రచనలు తాత్త్వికత -భజనమండల్ల సేవ' అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షుడు సంపత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా గుం డారెడ్డి పల్లి చెందిన రాజయోగి వరకవి సిద్ధప్ప తెలంగాణ తొలితరం యోగుల్లో ఒకరని వీరి కీర్తనలు పద్యాలు తెలుగు ప్రాంతాలో విశేషప్రాచుర్యం పొందాయన్నారు. సిద్ధప్ప కవిపై చేసిన పరిశోధన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం చాలా సంతోషంగా ఉందని సంపత్‌కుమార్ రెడ్డి తెలిపారు. పరిశోధన చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పరిశోధనలతో భవిష్యత్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 24 : పరిశోధనలతో విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమశాస్త్రవేత్తలుగా ఎదుగుతారని డాక్టర్ మధుసూదన్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ విద్యార్థులకు పరిశోధన అవకాశాలు అనే అంశపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాత్మక పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు పరిశోధనలపై మెళకువలను నిపుణులు వివరించారు. అధ్యాపకులు శ్రీధర్, మహేశ్ కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

చెరువు నుంచి మోటర్లు తొలిగించాలని వినతి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

చేర్యాల, ఫిబ్రవరి 24 : మండలంలోని కమాలాయపల్లి చెరువులో వేసిన మోటర్లను వెంటనే తొలిగించాలని కోరుతూ చెరువు పరిసర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కమాలాయపల్లి చెరువు పరిసరాల్లో ఉన్న 10 గ్రామాల వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని, 40 మంది వ్యక్తులు చెరువులో మోటర్లు ఏర్పాటు చేసిన నీటి తరలిస్తున్నారని దీంతో చిట్యాల, దొమ్మాట, అర్జునపట్ల, మైసంపల్లి, ఖానాపూర్, అంక్షాపూర్ గ్రామాల్లోని బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. కమాలాయపల్లి గ్రామ చెరువులో ఉన్న మోటర్లు వెంటనే తీసివేయాలని వినతిపత్రంలో కోరారు.

ప్రజలు ఐక్యంగా ఉండాలి

చేర్యాల, ఫిబ్రవరి 24 : గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో జీవనం సాగించాలని, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడవద్దని ఎస్సై నిరేశ్ కోరారు. మండలంలోని దొమ్మాట గ్రామాన్ని సోమవారం ఎస్సై పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, ఎన్నికల రోజుల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో సమస్యలు ఏర్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలని లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 24 : పల్లెల్లో ఆయా వర్గాల ప్రజలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని మిరుదొడ్డి ఎంపీడీవో గంగుల గణేశ్ రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి టౌన్‌లో జరుగుతున్న ఉపాధి హామీపనులను సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో కూలీ పనులు చేస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వీధి కుక్కల దాడిలో మూడు మేకలు మృతి

కొమురవెల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని గురువన్నపేటకు బ్రాహ్మణ్లపల్లి రాజయ్యకు చెందిన మేకలపై వీధి కుక్కలు దాడి చేసి మూడు మేకలను చంపేశాయి. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం రాజయ్య ఇంటి ఆవరణలో మేకలను కట్టేశాడు. సోమవారం ఉదయం చూసేసరికి కుక్కల దాడిలో మ